క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కొత్తపేట/రావులపాలెం: వైఎస్సార్‌ సీపీ కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షులను ఆ పార్టీ నియమించింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సూచనల మేరకు వైఎస్సార్‌ సీపీ న్యాయ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా కొత్తపేటకు చెందిన చావలి సుబ్బరాయశాస్త్రి, సమాచార హక్కు చట్టం విభాగం అధ్యక్షుడిగా రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామానికి చెందిన గుమ్మడి బాలకృష్ణ, చేతి వృత్తి నిపుణుల విభాగం అధ్యక్షుడిగా రావులపాలెంకి చెందిన అనుపోజు సాంబమూర్తి నియమితులయ్యారు.

స్టీల్‌ కంచాల అందజేత



విద్యార్థులకు స్టీల్‌ కంచాలు అందజేస్తున్న దాత శ్రీనివాసరావు

అయినవిల్లి: చింతనలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 214 మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఓలేటి శ్రీనివాసరావు రూ.40 వేలు విలువైన 214 స్టీల్‌ కంచాలు అందజేశారు. మధ్యాహ్న భోజనంలో ఈ స్టీల్‌కంచాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన పాఠశాల హెచ్‌ఎం పి.పల్లయ్య శర్మను కోరారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు స్వీట్స్‌ పంపిణీ చేశారు. దాతను గ్రామస్తులు, స్కూల్‌ సిబ్బంది అభినందించారు.

వైభవంగా సీతారాముల పవళింపు సేవ



వానపల్లిలో సీతారాముల పవళింపు సేవ నిర్వహిస్తున్న నాగబాబు–శేషవేణి దంపతులు

కొత్తపేట: మండలంలోని వానపల్లి బాలగణపతి స్వామివారి ఆలయం వద్ద బుధవారం రాత్రి సీతారాముల పవళింపు సేవను వైభవంగా నిర్వహించారు. గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా సీతారాముల నవసప్తాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా సీతారాముల పవళింపు సేవ కార్యక్రమాన్ని పోలాబత్తుల నాగబాబు–కనకలక్ష్మి శేషవేణి దంపతులతో వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో స్వామి, అమ్మవార్లను పవళింపజేశారు. భక్తులు స్వీట్స్‌ తీసుకురాగా స్వామివారికి నివేదించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చిన్నా కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



చిన్నా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రబాబు

అంబాజీపేట: ఇటీవల మృతి చెందిన అంబాజీపేట పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్‌ మేడిద రంగా జానకీ ప్రసాద్‌ (చిన్నా) కుటుంబ సభ్యులను కొర్లపాటివారిపాలెంలో గురువారం ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు పరామర్శించారు. చిన్నా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి ఓదార్చారు. ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. సుంకర బాలాజీ, మేడిద శ్రీను, నల్లా మాళి పరామర్శించిన వారిలో ఉన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో రఘురామ్‌



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో బీజేపీ జాతీయ నాయకులు పురిఘళ్ల రఘురామ్‌

అయినవిల్లి: స్థానిక సిద్ధివినాయక స్వామిని బీజేపీ జాతీయ నాయకుడు పురిఘళ్ల రఘురామ్‌ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ సిబ్బంది ఘనస్వాగతం పలికారు. రఘురామ్‌కు స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం అందజేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, రాష్ట్ర యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్‌, రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు కొపనాతి శ్రీరామచంద్రమూర్తి తదితరులు ఉన్నారు.

పాలిథిన్‌... పరేషాన్‌

- ప్లాస్టిక్‌పై సమరం.. ప్రచారానికే పరిమితం
- యథేచ్ఛగా ప్లాస్టిక్‌ కవర్ల విక్రయాలు
- తూతూ మంత్రంగా అవగాహన ర్యాలీలు



అంబాజీపేటలో ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ ర్యాలీ చేస్తున్న అధికారులు, కూటమి నాయకులు (ఫైల్‌)

అంబాజీపేట: బయటకు వెళ్తే, కాళ్లు కడుక్కొని ఇంట్లోకి వచ్చే మనం పాలిథిన్‌ భూతాన్ని మాత్రం స్వయంగా కొనుక్కొని మరీ ఇంట్లోకి తెచ్చేస్తున్నాం. చిన్నపాటి అశ్రద్ధ కారణంగా రోజు పదుల సంఖ్యలో క్యారీ బ్యాగ్‌లను వాడుతూ అటు పర్యావరణానికి, ఇటు మానవ ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నాం. వస్త్రంతో తయారు చేసిన చేతి సంచిని వినియోగిస్తే ఒక కుటుంబం రోజుకు పదిపైగా ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగుల వాడకాన్ని తగ్గించవచ్చు. కానీ ఆ దిశగా ఎవరూ ఆలోచించడం లేదు. దీంతో విచ్చలవిడిగా పాలిథిన్‌ వ్యర్థాలు, పేరుకుపోయి, ఇవన్నీ గ్రామ శివార్లలో డంపింగ్‌ యార్డులకు చేరుతున్నాయి. కొండలా పేరుకుపోతున్న వీటిని వదిలించే క్రమంలో నిప్పు పెడుతున్నారు. దీంతో తీవ్రమైన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. వాతావరణం వేడెక్కి కాలుష్యం మరింత పెరిగి చివరికి మానవాళికి ముప్పు తెచ్చుకుంటున్నారు. పాలిథిన్‌ నిషేధం అమలుపై అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇబ్బందులు తలెత్తున్నాయి. రాబోయే తరాలు ఆరోగ్యంగా జీవించాలంటే నేటి నుంచి ప్లాస్టిక్‌ వాడకాన్ని నిషేధించాలి. కానీ పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో ప్లాస్టిక్‌ వాడకాన్ని నిషేధించిన దాఖలాలు కనపడటం లేదు. 11 మండలాల్లో సుమారు 950 వరకు వివిధ రకాల దుకాణాలు ఉన్నట్లు అంచనా. ప్రతి షాపులోను పాలిథిన్‌ కవర్ల వినియోగం అధికంగా ఉంది.

తూతూ మంత్రంగా అవగాహన ర్యాలీలు

సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ కవర్లు, ఇతర వస్తువుల వాడకాన్ని నిషేదిస్తూ ఇటీవల మాచవరం, అంబాజీపేట, పుల్లేటికుర్రు గ్రామాల్లో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర ర్యాలీని పంచాయతీ అధికారులు, కూటమి నాయకులు నిర్వహించారు. ప్లాస్టిక్‌ వాడకాన్ని నిషేధించాలంటూ ఊకదంపుడు ప్రచారం చేయడంతో పాటు హోటల్స్‌, దుకాణదారులకు పంచాయతీ కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేశారు. ప్లాస్టిక్‌ వాడకాన్ని నిషేధించాలంటూ దుకాణదారులకు సమయం ఇచ్చి నెలలు గడిచాయే తప్ప ఆచరణలో అధికారులు అలసత్వం వహించారనే విమర్శలు వెలువడుతున్నాయి.

నిప్పు పెడితే ప్రమాదం

ప్లాస్టిక్‌ కాల్చితే ప్రమాదమని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ప్రక్రియతో విపరీతమైన వాయు కాలుష్యం ఏర్పడుతోంది. శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడేవారి సంఖ్య పెరగడానికి ఇది ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ప్లాస్టిక్‌ కాల్చకుండా ప్రభుత్వ యంత్రాంగం కూడా చర్యలు చేపట్టాలని, ఇందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ చూపాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్‌ వాడకం నిషేధానికి చర్యలు



ప్లాస్టిక్‌ వాడకాన్ని వచ్చే నెల 2వ తేదీలోగా పూర్తిగా నిషేధించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే షాపులు, కాఫీ హోటల్స్‌ యజమానులకు పంచాయతీ నుంచి నోటీసులు పంపిణీ చేశాం. ఈ నెల 15 నాటికి ప్లాస్టిక్‌ కవర్ల విక్రయాలను నిలుపుదల చేయాలని ఆదేశించాం. ప్లాస్టిక్‌ వస్తువుల వినియోగం వల్ల ప్రబలే రోగాలు, ఇబ్బందులను ప్రజలకు వివరిస్తున్నాం.

– కె.శ్రీనివాస్‌, డిప్యూటీ ఎంపీడీఓ, అంబాజీపేట

గౌరవ వేతనం పెంచాలని ఎంపీటీసీల ఆందోళన



మామిడికుదురులో ధర్నా చేస్తున్న వైఎస్సార్‌ సీపీ ఎంపీటీసీలు

మామిడికుదురు: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం గౌరవ వేతనం పెంచాలని డిమాండ్‌ చేస్తూ వైఎస్సార్‌ సీపీ ఎంపీటీసీలు మండల పరిషత్‌ సమావేశాన్ని గురువారం బహిష్కరించారు. మామిడికుదురు మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం పెంచాలని, మండల పరిషత్‌ ద్వారా వెంటనే నిధులు మంజూరు చేయాలని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వేతనం పెంపు హామీ అమలు చేయాలని, గ్రామాలకు జనాభా ప్రాతిపదికన నిధులు విడుదల చేయాలని, డిమాండ్‌ చేశారు. వీటిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎంపీపీ కుసుమ వనజకుమారికి వినతి పత్రాలు ఇచ్చారు. ఆందోళనలో ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్‌, సభ్యులు నయినాల సీతామహాలక్ష్మి, వర్ధినేని రాము, అంకాని వీరాంజనేయులు, మల్లాడి వడ్డికాసులు, జాలెం అనూష, గెద్దం మహాలక్ష్మి, కొప్పిశెట్టి దుర్గాపార్వతీదేవి పాల్గొన్నారు.

నిలకడగా కొనసాగుతున్న వరద

పి.గన్నవరం: వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి నిలకడగా కొనసాగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా వరద ఉధృతి తగ్గకుండా నిలకడగా ఉండటంతో లంక గ్రామాల ప్రజలు బయటకు వచ్చేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో ఆ గ్రామాల ప్రజలు సుమారు 50 రోజుల నుంచి పడవలపై ప్రయాణిస్తున్న విషయం తెలిసిందే. అలాగే మన జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై వెళ్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే మునిగిపోవడంతో ఆగ్రామ ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. లంక గ్రామాల్లోని పశువులకు మేత లేకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ముగ్గురికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

మామిడికుదురు: స్థానిక జెడ్పీహెచ్‌ స్కూల్‌లో పని చేస్తున్న స్కూల్‌ అసిస్టెంట్‌ మట్టా నాగరాజు, మొగలికుదురు మోడల్‌ ప్రైమరీ స్కూల్‌ హెచ్‌ఎం బత్తుల రమాబాయి, పాశర్లపూడిలంక జెడ్పీహెచ్‌ స్కూల్‌ ఇంగ్లీష్‌ స్కూల్‌ అసిస్టెంట్‌ దొమ్మేటి శ్రీరామకృష్ణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారని ఎంఈఓలు ఎం.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు గురువారం తెలిపారు.

పాఠశాలకు స్పోర్ట్స్‌ కిట్ల పంపిణీ

మామిడికుదురు: అప్పనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు గురువారం స్పోర్ట్స్‌ కిట్లను అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌ వీటిని స్కూల్‌ హెచ్‌ఎం బావరాజు సూర్యప్రకాశరావుకు అందజేశారు. అనంతరం గ్రామంలో జరిగిన సమావేశంలో బీజేపీ అధికార ప్రతినిధిగా ఎంపికైన సందర్భంగా పవన్‌ను సత్కరించారు. తులా బ్రహ్మజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మేడేపల్లి చిన్న, తులా శ్రీను, తులా చిన్న, కంకిపాటి బాలాజీ, బొలిశెట్టి శివ, పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయానికి జలప్రసాద సౌకర్యం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం గ్లోబల్‌ ఫౌండేషన్‌ ఇంక్‌ అమెరికా సౌజన్యంతో రూ.2 లక్షలు విలువైన స్వామివారి జల ప్రసాదం (భక్తులకు తాగునీరు సరఫరా)ను గురువారం ఏర్పాటు చేశారు. అడాప్ట్‌ ఏ విలేజ్‌ కాన్సెప్ట్‌లో భాగంగా ఫౌండేషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ భూపతిరాజు పండేటి భక్తులకు పై తాగునీటి సరఫరా చేసే పథకాన్ని సమకూర్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్‌, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు ఈ పథకానికి పూజలు చేశారు. రాజోలు నియోజకవర్గ ఫౌండేషన్‌ కన్వీనర్‌ జంపన బుజ్జిరాజు నేతృత్వంలో ఏర్పాటు చేసిన పై తాగునీటి సౌకర్యాన్ని ఆలయ చైర్మన్‌, ఫౌండర్‌ ఫ్యామిలీ మెంబర్‌ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహద్దూర్‌ ప్రారంభించారు. ఆలయ అసిస్టెంట్‌ కమిషనర్‌ ఎంకేటీఎస్‌వీ ప్రసాద్‌, ప్రముఖ వ్యాపారవేత్తలు కేవీ రామకృష్ణంరాజు, డి.శ్రీనురాజు, ప్రముఖులు వనమాలి మూలాస్వామి, అల్లూరు మధురాజు తదితరులు పాల్గొన్నారు.



అంతర్వేది ఆలయంలో స్వామివారి జల ప్రసాదం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

డ్వాక్రా మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



మామిడికుదురులో చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: డ్వాక్రా గ్రూపు సంఘాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలతో ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. మామిడికుదురు మండల పరిషత్‌ కార్యాలయం వద్ద గురువారం 23 సంఘాలకు రూ.2.30 లక్షలు రివాల్వింగ్‌ ఫండ్‌ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ కొనిరెడ్డి అంజిబాబు, డీఆర్‌డీఏ ఏపీఎం విప్పర్తి వెంకటరమణ, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అనంతరం జరిగిన సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఏఈ సురేష్‌ మాట్లాడారు. అప్పనపల్లి కాజ్‌వేతో పాటు బి.దొడ్డవరం, అప్పనపల్లి ఆర్‌ అండ్‌బీ రోడ్డును సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.14.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. వరదల సీజన్‌ ముగిసిన వెంటనే ఈ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్‌ పెనుమాల లక్ష్మి, ఎంపీడీఓ జి.భవాని, డీటీ శరణ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ

పి.గన్నవరం: అనారోగ్యానికి గురై కోలుకుంటున్న బాధితులకు సీఎం సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలోని 110 మంది లబ్ధిదారులకు గురువారం పి.గన్నవరంలోని తన కార్యాలయంలో రూ.67,02,000 లను ఎమ్మెల్యే చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ పెనుమాల లక్ష్మి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా రాధాకృష్ణన్‌ చిత్రాలు



ఈదరాడలో కొవ్వొత్తిపై రూపొందించిన రాధాకృష్ణన్‌ చిత్రం



మగటపల్లి విద్యార్థులు తీర్చిదిద్దిన సర్వేపల్లి చిత్రం

మామిడికుదురు: వెలుగు అనే విజ్ఞానాన్ని అందిస్తూ టీచర్‌ ఏ విధంగా కరిగిపోతాడో వివరిస్తూ ఈదరాడ జెడ్పీహెచ్‌ స్కూల్‌ డ్రాయింగ్‌ టీచర్‌ బత్తుల శ్రీనివాస్‌ క్యాండిల్‌పై సర్వేపల్లి రాధాకృష్ణన్‌ చిత్రాన్ని రూపొందించి అబ్బురపర్చారు. ప్రధాన క్యాండిల్‌ చుట్టూ టీచర్‌ లైఫ్‌ అనే ఇంగ్లీష్‌ అక్షరాలుగా కొవ్వొత్తులు వెలిగించి చేసిన దృశ్యం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. హెచ్‌ఎం జి.సాయిబాబా డ్రాయింగ్‌ టీచర్‌ను అభినందించారు. మగటపల్లి జెడ్పీహెచ్‌ స్కూల్‌ 8వ తరగతి విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్‌ చిత్రాన్ని రూపొందించి దాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దారు. హెచ్‌ఎం కె.రామలక్ష్మి ఆధ్వర్యంలో డ్రాయింగ్‌ టీచర్‌ జి.రామకృష్ణ పర్యవేక్షణలో దీన్ని తీర్చిదిద్దారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని వీటిని గురువారం ఆయా స్కూళ్లలో ప్రదర్శించారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం

అంబాజీపేట: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పుర్కస్కరించుకుని పుల్లేటికుర్రు నెహ్రూనగర్‌ మోడల్‌ ప్రైమరీ స్కూల్‌లో హెచ్‌ఎం గుబ్బల శ్రీనివాసరావు అధ్యక్షతన నలుగురు విశ్రాంత ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సత్కరించారు. కత్తుల ఆనందరావు, కత్తుల విజయశ్రీ, కరుపోతు దైవ వరప్రసాద్‌రాజు, చిల్లి యాకోబులను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..

కొత్తపేట: విద్యార్థులే ఉపాధ్యాయులుగా అవతారమెత్తారు. తరగతులు నిర్వహించారు. సహచర విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. ఈ వినూత్న కార్యక్రమం ఆత్రేయపురం మండలం ర్యాలి మండల పరిషత్‌ ప్రాథమిక ప్రధాన ఫౌండేషన్‌ పాఠశాలలో నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా ఆ పాఠశాల 1, 2 తరగతుల బాలలు ఉపాధ్యాయుల వేషధారణలో హాజరై పాఠశాలను నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పుతున్న పాఠశాల హెచ్‌ఎం చింతా శ్యామ్‌కుమార్‌ను సత్కరించారు.

గంటిలో ఫ్లెక్సీ వివాదం

కొత్తపేట: మండలంలోని గంటి గ్రామంలో పవన్‌కల్యాణ్‌ ఫ్లెక్సీతో వివాదం తలెత్తింది. ఈ నెల 2న సినీ హీరో, డీసీఎం పవన్‌కల్యాణ్‌ పుట్టినరోజు సందర్భంగా గంటిలో ఆయన అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీల్లో కొటేషన్లపై గ్రామంలో ఒక సామాజికవర్గం యువకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ గత రెండురోజుల్లో వాటిని తొలగించకపోవడంతో గురువారం ఆందోళనకు దిగారు.

అలాగే పి.గన్నవరం–ఈతకోట రోడ్డుపై ట్రాఫిక్‌ను అడ్డుకున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆ మేరకు పోలీసులు గంటి చేరుకున్నారు. పంచాయతీ అధికారులు, పోలీసులు కలసి ఫ్లెక్సీలు తొలగించారు. దానితో వివాదం సద్దుమణిగింది.

హోరాహోరీగా లడ్డూ వేలం పాటలు



మొగలికుదురులో లడ్డూ దక్కించుకున్న రాజేష్‌



అంబాజీపేట గంగలకుర్రు మలుపులో స్వామివారి లడ్డూ అందుకున్న భక్తులు, కో ఆర్డినేటర్‌ శ్రీనివాసరావు, ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: వినాయకచవితి నవరాత్ర ఉత్సవాలను మండలంలోని పలు వినాయక ఆలయాల వద్ద భారీ అన్నదానాలు గురువారం ఘనంగా జరిపారు. ఆలయాల వద్ద స్వామి వారి లడ్డూ వేలం పాటలు హోరాహోరీగా సాగాయి. గంగలకుర్రు మలుపు వద్ద ఉన్న విజయ గణపతి ఆలయం వద్ద స్వామి వారి లడ్డూను కామాడి రామమోహనరావు రూ.20 వేలకు కైవసం చేసుకున్నారు. అనంతరం స్వామి వారి ఊరేగింపును మేళతాళాలు, బాణాసంచా నడుమ ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకొన్న గణనాథుడిని మేలతాళాలు, భారీ బాణసంచా, యువకుల కేరింతల నడుమ మాచవరం, కె.పెదపూడి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, నందంపూడి, ఇసుకపూడి, చిరతపూడి గ్రామాల్లో కౌశికల్లో నిమజ్జనం చేశారు. గంగలకుర్రు మలుపు వద్ద గణపతిని వైఎస్సార్‌ సీపీ కో ఆర్డినేటర్‌ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్‌, బీసీ సెల్‌ అధ్యక్షుడు మట్టపర్తి హరిలు దర్శించుకుని పూజలు చేశారు.

రూ.54,500కు లడ్డూ వేలం

మామిడికుదురు: మొగలికుదురు జున్నూరినగర్‌ వినాయక మందిరాన్ని రూ.లక్ష నగదుతో అలంకరించారు. అదే మండపంలోని వినాయకుని చేతిలో ఏర్పాటు చేసిన తొమ్మిదిన్నర కిలోల లడ్డూను అదే గ్రామానికి చెందిన జున్నూరి రాజేష్‌ రూ.54,500కు దక్కించుకున్నారు. మాకనపాలెంలోని పంచాయతీ సమీపాన చెల్లింగి వారి గ్రూపులో వినాయకుని లడ్డూను మహిళలు రూ.31,300కు పాటలో దక్కించుకున్నారు.

సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి



పి.గన్నవరంలో శాంతామణి దంపతులను సత్కరిస్తున్న సహోద్యోగులు



నగరంలో రిటైర్డ్‌ సీహెచ్‌ఓ సత్యవతిని సత్కరిస్తున్న ఉద్యోగులు

పి.గన్నవరం: విధి నిర్వహణలో ఉద్యోగులు అందించిన ఉత్తమ సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ కేవీఎస్‌ఎన్‌ మూర్తి అన్నారు. నాగుల్లంక పీహెచ్‌సీలో పనిచేస్తున్న హెల్త్‌ సూపర్‌వైజర్‌ పోతుల సత్యశాంతమణి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా స్థానిక కోకోనట్‌ మర్చంట్స్‌ అసోషియేషన్‌ కళ్యాణ మండపంలో గురువారం ఆమెకు సన్మానం నిర్వహించారు. శాంతామణి, ఆమె భర్త యల్లమెల్లి రుక్మాంగధరావులను పలువురు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఉద్యోగులు సేవా దృక్పథంతో పని చేయాలి

మామిడికుదురు: ఉద్యోగులు సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఇంజేటి జాన్‌ లెవీ పేర్కొన్నారు. నగరం పీహెచ్‌సీలో సీహెచ్‌ఓగా పని చేసి గత నెలలో రిటైరైన కోడూరి సీతా సత్యవతిని గురువారం జరిగిన సమావేశంలో ఘనంగా సత్కరించారు. ఆమెను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

గ్రామాభివృద్ధికి శిక్షణ తరగతులు దోహదం

అంబాజీపేట: గ్రామాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు శిక్షణ తరగతులు దోహదపడతాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్‌ కార్యాలయంలో ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు అడ్వాన్స్‌మెంట్‌ ఇండెక్స్‌పై ఇన్‌చార్జి ఎంపీడీఓ ఏపీఎల్‌ నరసింహం అధ్యక్షతన ఒక రోజు శిక్షణ తరగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ నరసింహం, డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్‌ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కావలసిన నిధులు, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు పరిపూర్ణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నాలుగోరోజు పవిత్రోత్సవాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్‌ కమిషనర్‌ ప్రసాద్‌ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్‌ పర్యవేక్షణలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు నిర్వహించారు. గత మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు నాలుగోరోజు పూర్ణాహుతితో పరిపూర్ణం అయ్యాయి. స్వామివారికి కంచుగరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్‌, ఫౌండర్‌ ఫ్యామిలీ మెంబర్‌ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్‌, ప్రముఖులు కేవీ రామకృష్ణంరాజు, డి.శ్రీనురాజు, జంపన బుజ్జిరాజు, వనమాలి మూలాస్వామి, అల్లూరు మధురాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తపేట: వాతావరణ మార్పులతో వచ్చే సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవిడి పీహెచ్‌సీ డాక్టర్‌ ఎస్‌.శ్రీదివ్య సూచించారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్‌, జువాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్‌ శ్రీదివ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె సీజనల్‌ వ్యాధుల నివారణ చర్యల గురించి వివరించారు. సీజనల్‌ వ్యాధులపై వస్తే వెంటనే సమీప వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ పీఓ డాక్టర్‌ డీసీహెచ్‌ పాపారావు, అధ్యాపకులు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బోటు మరమ్మతుకు రూ.5 వేల సాయం

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడిలంక గ్రామ ప్రజల రాకపోకల కోసం వినియోగించనున్న ఇంజిన్‌ బోటుకు మరమ్మతుల కోసం బోటు నిర్వాహకుడికి నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఎస్సీ సెల్‌ విభాగం అధ్యక్షుడు సాధనాల రమేష్‌ గురువారం రూ.5 వేల సాయం అందించారు.

ఫ్లెక్సీలపై వివాదాస్పద వ్యాఖ్యలుంటే కఠిన చర్యలు

అంబాజీపేట: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సినీ, రాజకీయ ఫ్లెక్సీలపై వివాదాస్పద వ్యాఖ్యలు ప్రచురిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని పి.గన్నవరం సీఐ ఆర్‌.భీమరాజు హెచ్చరించారు. ఎవరైనా ఇకపై ఫ్లెక్సీలో పేరు విషయంలో రెండు వర్గాల మధ్యన విద్వేషాలు, వైషమ్యాలు, రెచ్చగొట్టే విధంగా ఉంటే ఆ ఫ్లెక్సీని తొలగించడంతో పాటు వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనుచిత వ్యాఖ్యలు ఉన్నా తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. ఫ్లెక్సీలపై ఎటువంటి అనుచిత వ్యాఖ్యలు ముద్రించినా, వివాదాస్పద వ్యాఖ్యలు ఉన్న నియోజకవర్గంలోని ఫ్లెక్సీల షాపు యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎలుకలను సామూహికంగా మట్టుబెట్టాలి

కొత్తపేట: ఖరీఫ్‌లో ఎలుకల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులందరూ సామూహిక ముందుకు రావాలని వ్యవసాయ శాఖ స్థానిక వ్యవసాయ సబ్‌ డివిజన్‌ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ (ఏడీఏ) ఎం.వెంకటరామారావు సూచించారు. స్థానిక సబ్‌ డివిజన్‌ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లో త్వరలో సామూహిక ఎలుకలు నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆయా మండలాల వీఏఓలు, వీహెచ్‌ఏలకు గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏడీఏ వెంకటరామారావు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఒకే రోజు నిర్వహించే కార్యక్రమం విజయవంతం చేయడానికి రైతులను ఎలా చైతన్యవంతులను చేయాలి. బ్రోమోడయోలిన్‌ మందుతో ఎలుకల ఎర ఎలా తయారు చేయాలి. వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తపేట, రావులపాలెం ఏఓలు, ఏఈఓలు, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు అండగా నిలవాలి

రాజోలు: దివ్యాంగ విద్యార్థులకు అండగా నిలవాలని వాసవి క్లబ్‌ అధ్యక్షుడు బలభద్ర కోటయ్య అన్నారు. రాజోలు రూరల్‌ వాసవీక్లబ్‌ ఆధ్వర్యంలో రాజోలు భవిత కేంద్రంలోని 24 మందికి స్టీల్‌ కంచాలు, గ్లాసులు అందజేశారు. మానసిక వైకల్యం ఉన్న వారికి మంచి శిక్షణ ఇవ్వాలని, భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, స్పీచ్‌ థెరపీ చేయడంతో దివ్యాంగ చిన్నారుల్లో అనేక మార్పులు వస్తున్నాయని ఐఈఆర్టీ రామలక్ష్మి వివరించారు. వాసవి క్లబ్‌ సభ్యులు వెత్స చిట్టిబాబు, పెదమల్లు సత్యనారాయణమూర్తి, నానాజీ, గెల్లి శ్రీను, గాదె సతీష్‌, నూలు సురేష్‌, మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్‌ సరఫరాకు రేపు అంతరాయం

కొత్తపేట: మండలంలోని పలు ప్రధాన, శివారు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు ఆరు గంటల పాటు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ అమలాపురం ఈఈ కె.రాంబాబు గురువారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. బిళ్లకుర్రు ఎస్‌ఎస్‌ 33/11 కేవీ విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ లైన్‌ పరిధిలో ట్రీ కటింగ్‌, ఎస్‌ఎస్‌ మరమ్మతుల నిమిత్తం వానపల్లి, బిళ్లకుర్రు, ముక్కామల ఎస్‌ఎస్‌ 11 కేవీ మోడేకుర్రు ఫీడర్‌లో ఆర్‌డీడీఎస్‌ పనులు నిమిత్తం మోడేకుర్రు, గొలకోటివారిపాలెం, పితానివారిపాలెం, రాకుర్తివారిపాలెం, అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామాలకు విద్యుత్‌ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.